# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. రాజకీయ నేపథ్యం లేని యువతను దేశ రాజకీయాలలోకి తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మన్ కీ బాత్ కార్యక్రమంలో తెలిపారు.
2. వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో కీలక భూమిక పోషించే నేషనల్ క్యాడెట్ కోర్..ఎన్‌సిసి.లో యువత అత్యధిక సంఖ్యలో చేరాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.
3. దేశంలో పర్యావరణ సమతుకాన్ని కాపాడడానికి దోహదం చేసిన "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం ఎల్లలు దాటి ప్రపంచ దేశాలకు కూడా విస్తరిస్తోందని నరేంద్ర మోదీ వెల్లడించారు.
4. ఆపదలో ఉన్నవారికి తమ ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు.
5. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటులో భాగంగా విశాఖపట్నంలో జోనల్ కార్యాలయ నిర్మాణానికి రైల్వేశాఖ టెండర్లు ఆహ్వానించింది.

==========================

రాజకీయ నేపథ్యం లేని కుటుంబాలకు చెందిన యువతను దేశ రాజకీయాలలోకి తీసుకువచ్చేందుకు గొప్ప ప్రయత్నం జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యే మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 116వ సంచికలో ఈరోజు తన మనసులోని భావాలను ఆయన ప్రజలతో పంచుకుంటూ.. అనేక అంశాలను ప్రస్తావించారు. రాజకీయ నేపథ్యం లేని కుటుంబాలకు చెందిన లక్ష మంది యువతను రాజకీయాలలోకి తీసుకురావడానికి దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. స్వామి వివేకానంద జయంతి అయిన జనవరి 12వ తేదీన ఢిల్లీలోని భారత మండపంలో యువజన ఆలోచనల మహా కుంభ మేళా జరుగుతోందని, ఈ కార్యక్రమానికి " వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్" అని పేరు పెట్టారని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు కూడా హాజరవుతున్న ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానని, భారత దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దబోయే తరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇది మంచి అవకాశమని సూచించారు. ఈ కార్యక్రమంలో యువత విరివిగా పాల్గొని దేశ భవిష్యత్ ప్రయాణాన్ని నిర్ణయించాలని నరేంద్ర మోదీ పిలుపునిస్తూ..

..వాయిస్...30 సెకన్లు

------------------------

మన వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో కీలక భూమిక పోషించే నేషనల్ క్యాడెట్ కోర్...ఎన్‌సిసి లో యువత అత్యధిక సంఖ్యలో చేరాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. తాను కూడా ఎన్.సి.సి. క్యాడెట్‌నేనని తెలిపారు. దేశంలో ఎన్.సి.సి.ని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి జరుగుతోందని, 2014 సంవత్సరంలో ఎన్.సి.సి క్యాడెట్ల సంఖ్య 14 లక్షలు ఉండగా, ప్రస్తుతం 24 లక్షలకు పెరగడం ప్రశంసనీయమని అన్నారు. యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవా స్ఫూర్తిని ఎన్.సి.సి పెంపొందిస్తుందని, ఎటువంటి ప్రకృతి విపత్తులు సంభవించినా సేవలు అందజేయడానికి ఎన్.సి.సి క్యాడెట్లే ముందుంటారని ప్రధానమంత్రి పేర్కొంటూ..

...వాయిస్..35 సెకన్లు

---------------------------

కోట్లాది మొక్కలు నాటడడం ద్వారా దేశంలో పర్యావరణ సమతుకాన్ని కాపాడడానికి దోహదం చేసిన “ఏక్ పేడ్ మా కే నామ్” కార్యక్రమం ఇపుడు ఎల్లలు దాటి ప్రపంచ దేశాలకు కూడా విస్తరిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. తల్లి రుణం మనం ఎన్నటికీ తీర్చుకోలేనిదని, అలాంటి మాతృమూర్తి కోసం మీ తల్లితో కలిసి ఒక మొక్కను నాటి ఆ ఫొటోను.. మైగవ్ డాట్ ఇన్‌లో పంచుకోవాలని ప్రధాన మంత్రి పిలుపునిస్తూ..

.వాయిస్...33 సెకన్లు

---------------------------

డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో వృద్ధులను కూడా భాగస్వాములను చేయాలని ప్రధాన మంత్రి యువతకు సూచించారు. పుస్తకాలతో పిల్లలకు అనుబంధాన్ని బలోపేతం చేయడానికి గ్రంధాలయం కంటే గొప్ప ప్రదేశం మరొకటి లేదని, ఈ దిశగా హైదరాబాదులోని ‘ఫుడ్ ఫర్ థాట్’ ఫౌండేషన్ అనే సంస్థ అద్భుతమైన ప్రయోగాలను చేసిందని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో లక్షలాది మంది భారతీయులు స్థిరపడ్డారని, భారతీయ వారసత్వాన్ని సజీవంగా ఉంచేందుకు వారు కృషి చేస్తున్నారని నరేంద్రమోదీ ప్రశంసించారు. ఇటువంటి అంశాలను కనుగొని ప్రజలు వాటిని కథనాల రూపంలో “నమో యాప్ లేదా మై గవ్ డాట్ ఇన్‌లో #Indian diaspora stories అనే హ్యాష్ ట్యాగ్‌తో పంచుకోవాలని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు.

---------------------------

పిల్లల్లో పఠనాసక్తిని ప్రోత్సహిస్తూ, దేశ వ్యాప్తంగా గ్రంధాలయాలను ఏర్పాటుచేస్తున్న ‘ఫుడ్ ఫర్ థాట్’ ఫౌండేషన్ గురించి ఈ రోజు మన్ కీ బాత్‌లో ప్రస్తావించటం పట్ల హైదరాబాద్ కు చెందిన ఆ సంస్థ వ్యవస్థాపకులు కె.శ్రీనివాసరావు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా 20 పైగా రాష్ట్రాలలో 90కి పైగా పట్టణాల్లో ఇంతవరకు ఆరు వందలపైగా గ్రంథాలయాలను ఏర్పాటు చేశామని, ఆకాశవాణి ప్రతినిధి ఎమ్.ఎస్. లక్ష్మికి చెప్పారు. లక్షన్నరకుపైగా పుస్తకాలను జియో ట్యాగ్ చేయటంతో పాటు, ఇలాంటి గ్రంధాలయాలను జైళ్లలో కూడా ఏర్పాటు చేశామని శ్రీనివాసరావు వివరిస్తూ...

...వాయిస్....26 సెకన్లు

---------------------------

ఆపదలో ఉన్నవారికి తమ ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా కొండెపి నియోజకవర్గ పరిధిలోని తూర్పు నాయుడు పాలెంలో ఆయన ఈ రోజు 30 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రయోజనం అందలేదన్నారు. 30 మందికి 38లక్షల 78వేల రూపాయల మేర ఆర్థిక సహాయాన్ని అందించామని వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తమ ప్రభుత్వం అవసరం అయిన వారికి, ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తోందని మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి వివరిస్తూ ...

.. వాయిస్ ... 22 సెకన్లు

---------------------------

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటులో భాగంగా విశాఖపట్నంలో జోనల్ కార్యాలయ నిర్మాణానికి రైల్వేశాఖ టెండర్లు ఆహ్వానించింది. 9 అంతస్తులు, రెండు సెల్లార్ పార్కింగ్ ఫ్లోర్లతో కలిపి మొత్తం 11 అంతస్తుల్లో భవన నిర్మాణం చేపట్టనున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 53 ఎకరాల భూమిని రైల్వేశాఖకు అప్పగించింది. దీంతో జోన్ కార్యాలయ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. 149 కోట్ల 16 లక్షల రూపాయల అంచనా వ్యయంతో భవనాన్ని నిర్మించనున్నారు. డిసెంబర్ 27వ తేదీ లోపు టెండర్లు దాఖలు చేయాలని రైల్వేశాఖ పేర్కొంది. టెండర్లు దక్కించుకున్న వారు రెండేళ్లలో పూర్తిచేయాలని నిర్దేశించింది.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనాన్ని మరింత శీఘ్రతరం చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకోసం ఏడు లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వెల్లడించారు. తిరుమలలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తిరుమలకు వచ్చిన భక్తులు ప్రధానంగా కోరుకునే సేవలను సంతృప్తికరమైన రీతిలో అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

---------------------------

డిసెంబర్ 5 వ తేదీన జరగనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 4 గంటల జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 2 వేల 894 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. మొత్తం 3 లక్షల 23 వేల మంది దరఖాస్తు చేయగా.. ఇందులో బూత్ స్థాయి అధికారుల పరిశీలన అనంతరం 2 లక్షల 90 వేల 978 మందిని ఓటర్లుగా గుర్తిస్తూ జాబితా ప్రచురించారు. ఈ జాబితాపై డిసెంబరు 9వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం

వాటిని పరిష్కరించి డిసెంబరు 30వ తేదీన తుది జాబితా విడుదల చేస్తారు. ఓటరుగా నమోదుకాని పట్టభద్రులు, ముసాయిదా జాబితాలో పేరు లేనివారు డిసెంబరు 9లోగా దరఖాస్తు చేయవచ్చు.

---------------------------

డిసెంబర్ 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్‌లో 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నియామక ర్యాలీ ఉంటుందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్ / స్టోర్ కీపర్ ట్రేడ్స్‌కు పదవ తరగతి అర్హతగా ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన మహిళా మిలిటరీ పోలీస్ అభ్యర్థులు అన్ని డాక్యుమెంట్లను తీసుకురావాలని బోర్డు సూచించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి డిసెంబరు ఒకటవ తేదీ వరకు విజయవాడలో 'బిజినెస్ ఎక్స్‌పో–2024' నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని ఏపీ ఛాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు తెలిపారు. విజయవాడలోని ఛాంబర్స్ కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో తమ సంస్థ ప్రతినిధులతో కలిసి బిజినెస్ ఎక్స్‌పో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధికి దోహదపడేలా ఈ బిజినెస్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామని తెలిపారు.

======================